క్లుప్తంగా

ఘనంగా శిలువకొండ ఉత్సవాలు



ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

పూడూరు: మండలంలోని గట్టుపల్లి శిలువకొండ ఉత్సవాలు ఫాదర్ తంగప్ప ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్తుతి ఆరాధన, దివ్యబలిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధి భక్తులే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రధాని జన్మదిన వేడుకలు



రక్తదానం చేసిన యువకులు

యాలాల: భారత ప్రధాని నరేంద్రమోడీ పుట్టిన రోజు సందర్భంగా యాలాల మండలానికి చెందిన పలువురు యువకులు ఆదివారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ ప్రధానిగా మోడీ ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. భారత్ విశ్వగురువుగా ప్రఖ్యాతి పొందడంతో మోడీ సేవలు మరువలేనివన్నారు. రక్తదానం చేసిన వారిలో రాథోడ్ సునీల్, రామవత్ కిషన్, బీరప్ప, పాండు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీవరాహస్వామి జయంతి



విశేష అలంకరణలో వరాహస్వామి

కొడంగల్ రూరల్ : పట్టణంలో పేదల తిరుపతిగా వెలసిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం శ్రీవరాహస్వామివారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తిరుమలలో జరిగేలా శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వరాహస్వామివారికి తొలి దర్శనం, మొదటి అర్చన, మొదటి నివేదన చేశారు. అంతకుముందు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ చేసి మంగళహారతులు అందిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు విరాళం

తాండూరు టౌన్: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక ఉత్సవాలకు ఆదివారం రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ రూ. 25వేల విరాళం అందజేశారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా వినాయక ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, పూజారి పాండు, కిరణ్, అశోక్, శుభప్రద్‌పటేల్ ట్రస్టు సభ్యులు భాను, శ్రీశైలం, ఆబిద్, హరీశ్, విజయ్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కొడంగల్: మాట్లాడుతున్న సీఐ రాములు

కొడంగల్: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ రాములు హెచ్చరించారు. ఆదివారం కొడంగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, పలు పార్టీల నాయకులతో ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. డీజేలకు అనుమతి లేదన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. మండపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖ అధికారుల అనుమతి తప్పక తీసుకోవాలన్నారు.

అనుమతి తప్పనిసరి..

పూడూరు: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని చన్గోముల్ ఎస్ఐ గిరి తెలిపారు. ఆదివారం చన్గోముల్ పోలీస్ స్టేషన్‌లో యువజన సంఘాలు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్ఐ శాంతి సమావేశం నిర్వహించారు. వినాయక మండపాలతో పాటు విద్యుత్, మైక్ పర్మిషన్‌లను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వివాదాస్పద స్థలాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించరాదని అన్నారు. డీజేలకు అనుమతులు లేవని ఎవరైనా పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



దోమ: సభకు బయలుదేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు



దౌల్తాబాద్: విజయభేరికి తరలివెళ్తున్న నాయకులు



మర్పల్లి : సభకు వెళ్లే ముందు సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభకు ఆదివారం ఆ పార్టీ శ్రేణులు జిల్లా నుంచి భారీగా తరలివెళ్లారు. బస్సులు, కారులు ఇతర వాహనాల్లో తుక్కుగూడకు వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకొనే అవకాశం వచ్చిందని వివరించారు.



అనంతగిరి నుంచి..



పెద్దేముల్: విజయభేరి సభకు తరలిన కార్యకర్తలు



పూడూరు: మన్నేగూడ నుంచి..



కొడంగల్: తుక్కుగూడకు వెళ్తున్న తిరుపతిరెడ్డి



మోమిన్‌పేట నుంచి..



కుల్కచర్ల : సభకు బయలుదేరుతున్న నేతలు

నేడు జిల్లాకు సీడబ్ల్యూసీ సభ్యులు

వికారాబాద్ : నేడు (సోమవారం) వికారాబాద్ జిల్లాకు నలుగురు సీడబ్ల్యూసీ సభ్యులు రానున్నారు. ఆదివారం తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో సోనియా చేతుల మీదుగా ఆవిష్కరించిన గ్యారంటీ పథకాల కార్డులు పట్టుకుని ప్రజల తలుపు తట్టనున్నారు. జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాలకు నలుగురు ముఖ్యనేతలు, సీడబ్ల్యూసీ సభ్యులు కూడా హాజరుకానున్నారు. వారికి కేటాయించిన నియోజకవర్గాలను సందర్శించి పేదల ఇళ్లకు వెళ్లనున్నారు. ఒక్కొకరు వంద ఇళ్లు సందర్శించనున్నారు. అధికారంలోకి రాగానే 30 రోజుల్లో ఈ పథకాలు అమలు చేసి తీరుతామని పేదలకు గ్యారంటీ ఇవ్వనున్నారు.

సీడబ్ల్యూసీ సభ్యులు వీరే

నియోజకవర్గానికి ఏఐసీసీ కార్యదర్శి పవన్ ఖేరా, పరిగి నియోజకవర్గంలో పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎం సుఖేందర్‌సింగ్‌రంధువా పర్యటించనున్నారు. తాండూరులో ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీష్ రావత్, మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటేల్ కొడంగల్ నియోజకవర్గానికి రానున్నారు. వీరు పర్యటించి వెళ్లే వరకు స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో పాటు పీసీసీ కార్యదర్శులను సపోర్టుగా వారి వెనకాల ఉండేలా అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. పరిగికి సంజీవ్ ముదిరాజ్, వికారాబాద్, తాండూరులకు రాపోల్ జయప్రకాష్, కొడంగల్‌కు వీర్లపల్లి శంకర్‌లు నియోజకవర్గాలకు రానున్న సీడబ్ల్యూసీ సభ్యులకు సహాయకులుగా వ్యవహరించనున్నారు.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి



మట్టివినాయకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, తదితరులు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజించాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని పూడూర్ జెడ్పీటీసీ మేఘమాల ప్రభాకర్‌గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు హిందూ ధర్మరక్షణకు మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయకులను ప్రతిష్ఠించడం వల్ల నిమజ్జనం తరువాత జల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దీంతో ఆ నీటిని తాగడం వల్ల ఎన్నో ప్రమాదలు పొంచి ఉన్నాయన్నారు. తొమ్మిది రోజులు జరిగే వినాయక ఉత్సవాల్లో కులమత భేదాలు లేకుండా ప్రశాంతం జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో శివలింగానికి అభిషేకం

కొడంగల్ రూరల్ : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభమైన సందర్భంగా నార్లాపూర్ నుంచి తెచ్చిన కృష్ణా జలాలతో ఆదివారం పట్టణంలో శివాలయాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని శివలింగాలకు అభిషేకం చేశారు. పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, ప్రజలు, పర్సాపూర్ సర్పంచ్ సయ్యద్ అంజద్‌తో పాటు గ్రామాల్లో వెలసిన శివాలయాలలో శివలింగానికి ఆయా గ్రామాల నాయకులు అభిషేకం చేశారు. అలాగే, నార్లాపూర్ నుంచి కలశాలలో తెచ్చిన కృష్ణాజలాలను గ్రామాల్లోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వహిస్తూ ఆలయాలకు చేరుకొని శివలింగానికి అభిషేకం చేశారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవంతో ఏడాది పొడవునా పంటలు పండించుకునేందుకు అవకాశం కలుగుతుందని, తాగునీరు, సాగునీటి ఇబ్బందులు తొలగి ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పర్సాపూర్‌లో ఎంపీటీ శ్రీనివాస్, ఎంపీటీసీ గోవిందమ్మ బుగ్గప్ప, ఉప సర్పంచ్ మొగులయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు జనార్దన్, వార్డు మెంబర్లు హనుమంతు, లక్ష్మయ్య, శేఖర్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో అభిషేకం చేస్తున్న నాయకులు, అధికారులు

ఘనంగా విశ్వకర్మ జయంతి



తాండూరు: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, నాయకులు

తాండూరు: విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విరాట్ విశ్వకర్మ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని విరాట్ విశ్వకర్మ వేద భూమిలో నిర్వహించిన ఈ వేడుకల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు ఎస్ఎస్.పటేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణాచారి, పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి, పెద్దేముల్ వైస్ ఎంపీపీ మధులత తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

విరాట్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో..

పరిగి: సృష్టికి ఆది దైవం విశ్వకర్మ భగవానుడని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీ.రాంమ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో విరాట్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకల్లో వారు పాల్గొని పూజలు చేశారు. విశ్వకర్మలందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ఆ సంఘం సభ్యులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

సంఘటితంతోనే డిమాండ్ల సాధన



స్థల కేటాయింపు ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

అనంతగిరి: సంఘటితంతోనే డిమాండ్లను సాధించగలమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవన్‌లో కురుమల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆనంద్.. ఆత్మగౌరవ భవనానికి సంబంధించిన స్థలం కేటాయింపు ఉత్తర్వులను ఆసంఘం నాయకులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. సమావేశానికి ముందుగా ఆయన ఒగ్గడోలు వాయించి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. కురుమసంఘం రాష్ట్ర కార్యదర్శి బండారి నారాయణ, కురుమ యువత రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగేశ్, రాష్ట్ర ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు సత్తయ్య, రాష్ట్ర నాయకులు ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోపాల్, కౌన్సిలర్ సువర్ణ, మాజీ కౌన్సిలర్ బోండాల శ్రీనివాస్, మహిళా సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోరాటం చేస్తూనే ఉంటాం..

అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ



పరిగి: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పరిగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 7రోజులుగా అంగన్‌వాడీలు నిరసనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు, పదవీ విరమణ బెనిఫిట్స్ , ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. మా డిమాండ్ల నెరవేర్చేవరకు పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా

తాండూరు టౌన్ : ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో సేవలందిస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ. 5 లక్షల చొప్పున చెల్లించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్, అంగన్‌వాడీ ఉద్యోగులు బేబి, సుధారాణి, జయంతి, రాజేశ్వరి, శశికళ, హెల్పర్లు నర్సమ్మ, సంధ్య, భారతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కొడంగల్ రూరల్ : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసనలు వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26వేలు అందించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంగన్‌వాడీ ప్రాజక్టు నియోజకవర్గ అధ్యక్షురాలు రెహనాబేగం, కార్యదర్శి కె.నవనీత, అంగన్‌వాడీ సంఘం సభ్యులు శివలీల, జయమ్మ, వెంకటమ్మ, కృష్ణమ్మ, జ్యోతి, రాములమ్మ, సావిత్రమ్మ, ఆనంద, వినోద పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

అనంతగిరి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 7 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం మోకాళ్ళపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ..పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మి, సుజాత, కవిత, మనోహర, స్వరూప, విజయలక్ష్మి, ప్రమీల, భాగ్యలక్ష్మి, కళావతి, సంగీత, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పరిగి అసెంబ్లీ కోకన్వీనర్‌గా శంకర్‌నాయక్



పరిగి: బీజేపీ పరిగి అసెంబ్లీ కో కన్వీనర్‌గా శంకర్‌నాయక్‌ను నియమిస్తూ ఆదివారం రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. గండీడ్ మండలానికి చెందిన శంకర్‌నాయక్ గతంలో మండల అధ్యక్షుడిగా పనిచేసి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నాడు. అధిష్టానం ఆయన సేవలను గుర్తించి అసెంబ్లీ కో కన్వీనర్‌గా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు తాను ఎల్లప్పుడు పని చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన వారికి అందేలా కృషి చేస్తానని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తుందని చెప్పారు.

దళితులను మోసం చేస్తున్న కేసీఆర్

పరిగి: 'దళితబంధు'తో దళితులను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని పలువురు దళిత నేతలు ఆరోపిస్తున్నారు. ఆదివారం మండలంలోని ఖుదావన్‌పూర్‌కు చెందిన దళితులు పరిగి- షాద్‌నగర్ రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. దళితబంధు పథకాన్ని అనర్హులకు ఇస్తున్నారని, అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితలకు కాకుండా పార్టీ నాయకులకు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆరోపించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాల్లో రాజకీయ నాయకుల జోక్యం ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

ఆనాటి నాయకుల త్యాగ ఫలితమే



జెండా ఎగురవేస్తున్న మండల ఎంసీపీఐ నాయకులు



తాండూరు రూరల్‌లో..



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

మోమిన్‌పేట: ఆనాటి నిస్వార్థ నాయకుల త్యాగ ఫలితమే తెలంగాణ విమోచనం జరిగిందని ఎంసీపీఐ మండల కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. ఆదివారం పాత బస్టాండు వద్ద తెలంగాణ విమోచన దినం సందర్భంగా పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. నిజాంకు వ్యతిరేకంగా వేల ప్రాణాల ఫలితంగానే నేడు విమోచనం లభించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మాణయ్య, బాచ్చయ్య, రామయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గేటు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు శేఖాపూరం ఆంజనేయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాంకు వ్యతిరేకంగా లక్షలాది మంది చేసిన పోరాట చరిత్రను కాంగ్రెస్ పార్టీ సమాధి చేసే ప్రయత్నం చేసిందన్నారు. ఎంఐఎంకు భయపడి బీఆర్ఎస్ విమోచన దినోత్సవం నిర్వహించడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనన్నారు. కార్యక్రమంలో చిరంజీవి ,సంజీవ్‌రెడ్డి,నరేందర్,నక్కల రమేష్, ప్రశాంత్ గౌడ్ ,అంజిలప్ప, శాంతు, సాయికుమార్,మనోజ్‌లు ఉన్నారు.

జెండా ఆవిష్కరించిన ఎస్పీ

అనంతగిరి : జాతీయ సమైక్య దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని ఆదివారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంపై ఎస్పీ కోటిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశం, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఆర్ఐ అచ్యుతారావు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఘనంగా విమోచన దినోత్సవం

దోమ : మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి గ్రామంలో ఆదివారం విమోచన దినోత్సవం బీజేపీ నేతలు ఘనంగా జరుపుకొన్నారు. పార్టీ నేతలతో కలసి జాతీయ జెండాను ఎగురవేసి ఉత్సవాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధానకార్యదర్శి మల్లేశ్ మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ అధికారంలోకి రాకముందు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి, సీఎం అయ్యాక రాచరిక పాలనను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, బజరంగ్ దళ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరులను విస్మరించిన ప్రభుత్వం

దౌల్తాబాద్: మండలంలోని గోకఫసల్‌వాద్‌లో ఆదివారం విమోచన దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం జాతీయజెండాను ఎగురవేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ ..1947 ఆగస్టు15న స్వాతంత్ర్యం వస్తే తెలంగాణకు సెప్టెంబర్ 17న వచ్చిందన్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది అమరులయ్యారని వారిని ప్రభుత్వం విస్మరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేశవరెడ్డి, బుగ్గప్ప రాములు ఉన్నారు.

బీజేపీ మండల కార్యాలయంలో..

మర్పల్లి: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బన్నె మల్లేశ్‌యాదవ్ సమక్షంలో పార్టీ కార్యాలయం ఎదుట సర్దార్ వల్లబాయి పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ.. నిజాం రజాకర్ల నుంచి స్వేచ్ఛ స్వాతంత్ర్య కోసం ప్రాణాలర్పించిన నాటి సమరయోధుల ప్రాణత్యాగాలు, పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి లక్ష్మణ్, బస్వలింగం, నాయకులు ఉన్నారు.